క్లుప్తంగా

పూరిమెట్ల జెడ్పీ హైస్కూల్‌కు మూడెకరాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లికి గ్రామస్తుల కృతజ్ఞతలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పూరిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మూడు ఎకరాల స్థలాన్ని మంజూరు చేయించారు. గతేడాది ఆ పాఠశాలకు తనిఖీ కోసం వెళ్లగా విద్యార్థులు చెట్ల కింద కూర్చుని పాఠాలు చదువుకోవడం చూసి ఆమె చలించిపోయారు. ఆ మేరకు ఆ రోజే పాఠశాలకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వెంటనే స్థలాన్ని మంజూరు చేయాలని అప్పటి కలెక్టర్ దినేష్ కుమార్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. ఎన్నికల కోడ్ రావడంతో ఫైల్ ముందుకు సాగలేదు. ఆ తర్వాత అధికారులు పాఠశాలకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్థలాన్ని క్లాస్ రూమ్‌లు, ఆట స్థలానికి ఉపయోగించుకోనున్నారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు బూచేపల్లి వెంకాయమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఈఓ



త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం బాలసుందరీదేవి, పార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల నూతన ఈఓగా డి. రజనీకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓగా పని చేసిన చెన్నకేశవ రెడ్డి బదిలీపై వెళ్లారు. ఆమెను కలిసిన వారిలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఇమ్మిశెట్టి సుబ్బారావు, ఆర్యవైశ్య అన్నదాన సత్రం నిర్వాహకులు అనుమలశెట్టి సుబ్బారావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

పెద్దదోర్నాల: ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురం గిరిజన గూడెంలో ఆయన చెంచు గిరిజనులతో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. తమ గూడెల్లో ఆర్‌ఓఎఫ్ఆర్ భూములను గుర్తించి వాటికి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో పాటు పలు గూడేల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో మంత్రి మాట్లాడుతూ విద్యుత్ లేని 1750 ఆదివాసీల గృహాలను గుర్తించి వాటిలో 956 గృహాలకు విద్యుత్ సరఫరా కల్పించినట్లు తెలిపారు. టైగర్ రిజర్వు ఫారెస్టులోని 611 కుటుంబాలకు సోలార్ కనెక్షన్లు ఇప్పించినట్లు చెప్పారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలు : ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో..



మార్కాపురం : ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి





పామూరులో మదన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ (ఇన్‌సెట్‌లో) విశిష్ట అలంకరణలో స్వామివారు



కొనకనమిట్ల : ప్రత్యేక అలంకారంలో వెలుగొండ వెంకటేశ్వరస్వామి



ఒంగోలు : శ్రీగిరిపై వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్త జనం



రాచర్ల : నెమలిగుండ్ల రంగనాయకస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



సింగరాయకొండ : ఉత్తర ద్వారంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి



పెద్దారవీడు : తిరుమలనాథస్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు



గిద్దలూరు షరాబ్ బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



బేస్తవారిపేట త్రిలోక పుణ్యక్షేత్రంలో కోలాట ప్రదర్శన



దర్శి కోదండరామాలయంలో భక్తుల భజనలు

'ముక్కోటి' దండాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల మూల విగ్రహమూర్తులను విశిష్టంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల వద్ద రద్దీ ఏర్పడటంతో దేవదాయశాఖ అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

ట్రాక్టర్ ఢీకొని ఒకరు దుర్మరణం?

- టీడీపీ పెద్దల అండతోనే హత్య చేశారని బంధువుల ఆరోపణ
- మృతుడు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు
- కొనకనమిట్ల మండలం వాగుమడుగులో ఘటన



మృతి చెందిన పెద్దచెన్నయ్య



సంఘటనా స్థలంలో వదిలి వెళ్లిన ట్రాక్టర్

కొనకనమిట్ల: మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కొనకనమిట్ల మండలం వాగుమడుగు సమీపంలో చోటుచేసుకుంది. అయితే ఇది ప్రమాదం కాదని, పాత కక్షలతోనే హత్య చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. అందిన సమాచారం మేరకు.. వాగుమడుగు గ్రామానికి చెందిన సాదం పెద్దచెన్నయ్య(40) పక్కనే ఉన్న అంబాపురంలో ఉంటున్న తన కుమార్తెను తీసుకొచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన కదమ బుజ్జయ్య ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఎగిరిపడ్డాడు. ట్రాక్టర్ టైర్ మీదకు ఎక్కడంతో పెద్దచెన్నయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు ట్రాక్టర్‌ను అక్కడే వదిలి పరారయ్యాడు. మృతుడు పెద్దచెన్నయ్యకు భార్య రమణమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

కుట్ర చేసి చంపారు

వాగుమడుగులో వైఎస్సార్ సీపీ కార్యకర్త అయిన పెద్దచెన్నయ్యను టీడీపీ పెద్దల అండతో అదే పార్టీకి చెందిన కదమ బుజ్జయ్య ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపాడని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితే తమకు సమాచారం ఇవ్వకుండా ట్రాక్టర్‌ను వదిలేసి ఎందుకు పారిపోయాడని బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కుట్రలో భాగమేనని పేర్కొంటూ సంఘటనా స్థలంలోనే మృతదేహాన్ని ఉంచి నిరసనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు పోలీసులు యత్నించగా నిందితుడు బుజ్జయ్యను వెంటనే అరెస్ట్ చేసి నిజం నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

ఫార్మసి కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అరెస్ట్



విద్యార్థినులను విచారిస్తున్న పోలీసులు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఫార్మసి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ రాజశేఖర్‌ను లైంగిక వేధింపుల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కళాశాలకు చెందిన కొందరు విద్యార్థినులు గురువారం రాత్రి మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ రాజశేఖర్‌ను ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్, ఎస్సై శివరామయ్య విచారించారు. శుక్రవారం సాయంత్రం అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

మార్కాపురం: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. వివరాలు.. గతేడాది ఆగస్టు 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అనంతపురం టౌన్‌లోని భవానీ నగర్‌కు చెందిన జానకొండ దామోదర్ ధర్మవరం నుంచి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. ఆయన నిద్రపోతున్న సమయంలో ప్యాంటు జేబులో నుంచి గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ తీసుకొని అందులో ఉన్న ఫోన్ నంబర్లకు తనకు అత్యవసరంగా డబ్బులు అవసరం అయ్యాయని మెసేజ్ చేశాడు. అది నమ్మిన వారు సుమారు రూ.50 వేలు పంపారు. ఈ విషయాన్ని గుర్తించిన దామోదర్ మార్కాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామానికి చెందిన మల్లె పద్మరాజును నిందితుడిగా గుర్తించారు. విచారణలో నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదం కాదది.. పక్కా హత్య

- పథకం ప్రకారమే టిప్పర్‌తో స్కూటీని ఢీకొట్టిన నిందితుడు
- క్షతగాత్రురాలి ఫిర్యాదుతో హత్య కేసుగా మార్పు

మార్కాపురం: మార్కాపురం మండలం కుంట–జమన్నపల్లి మధ్య గురువారం రాత్రి స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో రాధ అనే యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె అమ్మమ్మ ఈర్లపాటి సుబ్బలక్ష్మి తీవ్రగాయాలతో మార్కాపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఇది ప్రమాదం కాదని తమను చంపేందుకు పక్కా పథకం ప్రకారం టిప్పర్‌తో తన మరిదే ఢీకొట్టాడని క్షతగాత్రురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు శుక్రవారం ప్రమాద కేసును హత్య కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు, రూరల్ ఎస్సై అంకమరావు కథనం మేరకు.. మార్కాపురం మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈర్లపాటి పెద్ద వెంకటేశ్వర్లు భార్య సుబ్బలక్ష్మి పట్టణంలోని అమ్మవారిశాల బజారులో టైలరింగ్ చేసుకుంటూ చుట్టుపక్కల గ్రామాల్లో దుస్తులు అమ్ముతూ జీవిస్తోంది. భర్త, మరుదులతో విభేధాలు రావడంతో గత కొన్నేళ్లుగా విడిగా ఉంటోంది. గురువారం సుబ్బలక్ష్మి తన అక్క మనుమరాలైన రాధను స్కూటీపై ఎక్కించుకుని కొత్తపల్లి గ్రామంలో దుస్తులు విక్రయించి ఇంటికి బయలుదేరింది. గురువారం రాత్రి కోలభీమునిపాడు సచివాలయం దగ్గర నుంచి స్కూటీని ఆమె మరిది చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్‌తో వెంబడించాడు. జమ్మనపల్లి–కుంట మధ్య స్కూటీని ఢీకొట్టడంతో రాధ అక్కడికక్కడే మృతి చెందగా.. స్కూటీని టిప్పర్ కొంత దూరం ఈడ్చుకెళ్లింది. రాయవరం గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న రాధ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిందని, ఇలా తమకు దూరమవుతుందని అనుకోలేదని తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో రూ.పది లక్షల పరిహారం

- నిందితుడికి ఏడాది జైలు

కనిగిరి రూరల్: వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులుకూరి శామ్యూల్ విజయనందం అనే వ్యక్తి కనిగిరికి చెందిన మూలె శ్రీను అను వ్యక్తి నుంచి 6 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. దాని తాలూకా వడ్డీతో కలిపి రూ.10 లక్షలకు చెక్కు ఇచ్చాడు. శ్రీను చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. కేసు నాలుగేళ్ల విచారణ జరిగి శుక్రవారం కనిగిరి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర నిందితునికి రూ.10 లక్షల పరిహారం, ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం రాధాస్వామి సత్సంగం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ బాలుడు మరుగుదొడ్డికి వెళ్లేందుకు రాధాస్వామి సత్సంగం సమీపంలో ఉన్న చిల్ల చెట్ల వైపు వెళ్లాడు. అక్కడ ఎదురుగా ఉన్న చెట్లలో మృతదేహాన్ని గమనించి 100 ఫోన్ చేసి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అస్సాన్, ఎస్ఐ శివబసవరాజులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడు నీలిరంగు, ఎర్ర గడుల చొక్కా, నల్ల నిక్కరు ధరించి ఉన్నాడు. పొడవాటి వెంట్రుకలు, గడ్డం కలిగి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఒంగోలు టౌన్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్న తబ్లిగీ ఇస్తిమాకు ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రెండో రోజు శుక్రవారం కావడంతో జమాయత్‌తో కలిసి నమాజ్ చదవాలన్న ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో ముస్లింలు ఇస్తిమా ప్రాంతానికి చేరుకోవడంతో 25 ఎకరాల ఐటీఐ కాలేజీ ప్రాంగణం కిటకిటలాడింది. దీంతో త్రోవగుంట వైపు వెళ్లే దారులన్నీ రద్దీగా మారాయి. ఇస్తిమాకు దేవ్‌బంద్, హైదరాబాద్, విజయవాడ నుంచి ముస్లిం మత పెద్దలు తరలివచ్చి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. జుమా నమాజ్ అనంతరం దువా నిర్వహించారు. దేశ ప్రజలందరికీ సుఖ శాంతులు ప్రసాదించాలని, ప్రజల మధ్య సోదర భావాన్ని పెంపొందించాలని దువాలో అల్లాను వేడుకున్నారు.

నేలపాలు



రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడిన ట్యాంకర్

ముండ్లమూరు (దర్శి): మిల్క్ ట్యాంకర్ బోల్తా పడి రూ.3 లక్షల విలువైన పాలు నేలపాలైన సంఘటన మండలంలోని వేంపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగం డెయిరీకి చెందిన పాల ట్యాంకర్ కనిగిరి ప్రాంతం నుంచి గుంటూరు వైపునకు వెళ్తోంది. వేంపాడు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేయబోయి ట్యాంకర్ సైడ్ కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాలువలా టాంకర్‌లో పాలు ప్రవహించాయి. అనంతరం క్రేన్‌తో పాల టాంకర్‌ను పైకి ఎత్తారు. ట్యాంకర్ బోల్తా పడటంతో అక్కడకు భారీగా జనాలు చేరుకున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం జరిగింది. సుమారు రూ.3 లక్షల విలువైన పాలు నేలపాలైనట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి భర్త దుర్మరణం

తాళ్లూరు: రోడ్డు ప్రమాదంలో మేజర్ పంచాయతీ తూర్పు గంగవరం సర్పంచి చాట్ల నాగమణి భర్త సుధాకర్(32) దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన చీమకుర్తి మండలం పల్లామల్లి సమీపంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. సుధాకర్ ఒంగోలులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ బైకుపై ఒంగోలు వెళ్లి రాత్రికి ఇంటికి వస్తాడు. ఈ క్రమంలో విధులకు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యంలోని పల్లామల్లి వద్ద బైకు చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య నాగమణి తూర్పు గంగవరం మేజర్ పంచాయతీ సర్పంచిగా పని చేస్తున్నారు.

నేత్రపర్వం.. రంగనాయకుడి గ్రామోత్సవం


వెలుగొండలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారి మూలవిరాట్

రాచర్ల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన జేపీ చెరువు సమీపంలోని నెమలిగుండ్లరంగనాయకస్వామి గ్రామోత్సవం అంత్యంత వైభవంగా సాగింది. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని త్రికూట వెంకటేశ్వరస్వామి, బేస్తవారిపేటలోని రాములవారి ఆలయం, గొట్టిమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి ఆలయాలు వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. త్రికూట వెంకటేశ్వరస్వామి, రాములవారి ఆలయాల్లో ఉత్తరద్వారం నుంచి స్వామివార్లను భక్తులు దర్శనం చేసుకున్నారు. అభిషేకాలు, అష్టోత్తర పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. త్రికూట వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం, కోలాటం నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అన్ని ఆలయాలల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, షరాబ్ బజారులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, వైఎస్సార్ సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, రాచర్ల రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూకట్టారు. ఆలయాల వద్ద సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వివిధ దేవాలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీదేవి భూదేవీ సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 4 గంటల నుంచే నక్తులు స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్నారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవ, వెంకటేశ్వరస్వామి వార్లను ఉభయ దేవేరులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు, అహరోన్ తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు.


మార్కాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జంకె పూజలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేల మాళిగలోని శ్రీరంగనాయకుల స్వామి వారిని, వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకున్నారు. ఉభయదాత వరికుంట్ల అనిల్, సురేఖ దంపతులు, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నకుమారి దంపతులు ధ్వజ స్థంభాన్ని భారీ గజమాలతో అలంకరించారు. మాజీ ఎంపీపీలు వెలిశెట్టి విజయగౌరి, శ్రావణి వెంకటేశ్వర్లు, వేంపాటి రమణమ్మ పోలిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు యక్కలి శేషగిరిరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు.


బేస్తవారిపేట ప్రత్యేక అలంకరణలో రాములవారు


పొదిలి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పోలిరెడ్డి దంపతులు

వెలుగొండలో భక్తుల కోలాహలం

కొనకనమిట్ల: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణతో వెలుగొండ క్షేత్రం మారుమోగింది. ఉత్సవ విగ్రహాలను ఉత్తర ద్వారంలో ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవమూర్తులను వెలుగొండ వీధుల్లో ఊరేగించారు. దేవస్థానం ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉభయ దాతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు వివిధ అన్న సత్రాల్లో భోజన వసతి కల్పించారు. కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో, గొట్లగట్టు రామాలయంలో ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణయాదవ అన్నదాన సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. బొల్లావుల ఉత్సవం, మహిళల కోటాటం, గంగిరెద్దుల విన్యాసాలు, పొట్టేళ్ల పందెం కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి సందర్భంగా శ్రీవారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.


పుష్పాలంకరణలో పాల్గొన్న అనిల్ దంపతులు

యాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోని శ్రీకృష్ణయాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిటీ అధ్యక్షుడు పిన్నిక హరికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం సత్రం ఆవరణలో నిర్వహించిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చిలో శ్రీవారి బ్రహ్మోత్సవాను పురస్కరించుకుని పలు తీర్మానాలు చేశారు. అనంతరం హరికుమార్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.


హరికుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మాజీ ఎమ్మెల్యే అన్నాకు సన్మానం


అన్నా రాంబాబును సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాసులు, కార్యకర్తలు

మార్కాపురం: మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును మున్సిపల్ కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులతోపాటు పలువురు కార్యకర్తలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. పట్టణంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.

జార్జి ఫార్మసి కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు


రంగోలి పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మార్కాపురం టౌన్: జార్జి ఫార్మసి కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో పండగల ప్రాముఖ్యత, విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. సంక్రాంతి పండగ సందర్భంగా కళాశాలలో వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పండగల సందర్భంగా పూర్వీకులు పాటించిన పద్ధతులు, సంప్రదాయాలను యువతకు వివరిస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై రాజా జయరావు, అధ్యాపకులు, అధాపకేతర సిబ్బంది పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

మార్కాపురం: ఎంపీటీసీలు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ నారు బాపన్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఎస్‌సీవీకే నిలయం(రీడింగు రూము) ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బాల సుబ్బారావు, జి.సుబ్బారెడ్డి శుక్రవారం పలువురు పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీడింగు రూము ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిలయం ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, కోశాధికారి పి.మల్లికార్జునరావు, సెక్రటరీ మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, సభ్యులు కె.వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసమూర్తి, మల్లికార్జునరావు, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రీడింగు రూము సభ్యులు

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. సీఐ జయరావు ఆధ్వర్యంలో సిబ్బంది 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా, అక్రమ మద్యం సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

23 మద్యం బాటిళ్లు సీజ్


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ సీఐ

అర్ధవీడు: మండలంలోని కాకర్ల గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి 23 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమ మద్యం కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఫెడరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేయడాన్ని తప్పుబట్టారు. కార్మికులను సమస్యలు పట్టించుకోని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గర పడిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, ఏసురత్నం, బాలయ్య, చెన్నమ్మ, డి.వెంకటసుబ్బమ్మ, పాపయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో గిద్దలూరు ముందంజ


కంభం చెరువు

బేస్తవారిపేట: బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన తొలి స్వాతంత్ర్య సమరయోధునిగా చరిత్రకెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రకు ఆధారంగా కొత్తకోట ఫిరంగి దర్శనమిస్తుంది. భూమిశిస్తు చెల్లించాల్సిన అవసరం లేదని బ్రిటిష్ వారికి ఎదురుతిరిగారు. బ్రిటిష్ ప్రభుత్వం నరసింహారెడ్డిని విప్లవకారుడిగా ప్రకటించింది. ఆ సమయంలో కొత్తకోటలో ఒక బురుజు నిర్మించారు. 12 పిరంగులను సమకూర్చుకున్నారు. కుట్రలతో నరసింహారెడ్డిని పట్టుకుని బహిరంగంగా ఉరితీశారు. కొత్తకోట బురుజుపై ఉన్న 12 ఫిరంగుల్లో 11 పిరంగులను బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మిగిలిన ఒక పిరంగి, బురుజు నాటి నరసింహారెడ్డి పాలనకు చిహ్నాలుగా మిగిలిపోయాయి.

బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం ముక్తీశ్వరస్వామి భక్తుల కోర్కెలను తీరుస్తాడని నమ్మకం. మోక్షగుండంకు రెండు కిలోమీటర్ల దూరంలోని తూర్పుకొండ లోయలో క్షేత్రం ఉంది. నలువైపులా కొండలు, పచ్చని చెట్లు, కోనేరులతో అన్ని కాలాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం ఈ ముక్తీశ్వర క్షేత్రం ప్రత్యేకత. పరశురాముడు తన తండ్రి జమదగ్ని ఆజ్ఞతో తల్లి రేణుకాదేవిని హతమార్చి పాప పరిహారం కోసం ఇక్కడ గుడిలో శివలింగాన్ని పూజించి ముక్తి పొందాడని ప్రతీతి. అందుకే ఈ క్షేత్రానికి ముక్తీశ్వర క్షేత్రమని పేరొచ్చినట్లు స్థల పురాణం చెబుతోంది. గర్భగుడిలోని లింగాన్ని వశిష్టుడు ప్రతిష్ఠించారని స్థల పురాణం చెబుతోంది. శ్రీరాముడు సతీ సమేతంగా అరణ్యవాసం చేసే సమయంలో తండ్రి సంవత్సరీకాన్ని నిర్వహించేందుకు నీటి కోసం బాణం వేసి పాతాళ గంగను పైకి తెచ్చినట్లు భక్తుల ఉవాచ. అంతే కాదు.. వేలాది మంది రైతులకు సాగునీటి కష్టాలు తీరుస్తున్న కంభం చెరువు ప్రముఖ పర్యాటక కేంద్రంగా కూడా పేరొందింది. ఇన్ని ప్రత్యేకతలున్న గిద్దలూరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధిలోనూ ముందంజలో దూసుకెళ్తోంది.

ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్


డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ఉపాధ్యాయుడు

రాచర్ల మండలంలోని యడవల్లికి చెందిన డాక్టర్ మొర్రి పిచ్చయ్య హిందీ ఉపాధ్యాయుడుగా గిద్దలూరు మండలంలోని పాదలకుంట పల్లె హైస్కూల్లో పనిచేస్తున్నారు. 2010లో మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి వార్షిక వేతనంలో 20 శాతం విద్యాభివృద్ధికి, బాలికాభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే సొసైటీ ద్వారా 400 కార్యక్రమాలు నిర్వహించారు. కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహిస్తూ, నైతిక విలువలు బోధిస్తూ.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తూ ప్రసంశలు అందుకుంటున్నారు.

రాచర్ల స్పందనలో క్రమ శిక్షణతో విద్య


పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి స్పందన స్కూల్ ఎండీ

క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన చదువుకు కేరాఫ్‌గా నిలుస్తోంది రాచర్ల పట్టణంలోని స్పందన విద్యా సంస్థ. శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజింగ్ డైరక్టర్ పేర్ల సుదీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 1991లో స్పందన విద్యా సంస్థ ఏర్పాటైంది. పశ్చిమ ప్రాంతంలో పూర్తిగా వెనుకబడిన రాచర్ల మండల పరిసర గ్రామాల్లో అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ప్రతి ఏటా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తుండటం విశేషం. స్పందన స్కూల్‌కు రెండు పర్యాయాలు బ్రెయిన్ ఫీడ్ సంస్థ 'స్కూల్ ఎక్సలెన్స్' అవార్డులు అందజేసింది. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఎక్కువ శాతం ఆర్మీ, పోలీసు శాఖల్లో ఉద్యోగులుగా రాణిస్తున్నారు.